అనడంతో లోపల రాజుగారు లేరనుకుని వెళ్ళిపోయారు. అప్పుడు రాజుగారు 'ఆహా, దోమలు కుట్టబట్టే మేలుకుని తప్పించుకున్నాను. సాలె పురుగు నేను గుహలోకి వచ్చాక అల్లిన గూడు వల్ల నా ప్రాణాలు నిలిచాయి' అనుకున్నాడు.

ఆయన ఏ జీవులవల్ల మనుష్యులకి ఉపయోగం లేదనుకున్నారో వాటివల్లే రక్షింపబడ్డాడు. అలా దోమ ప్రాముఖ్యత దోమది. మన మున్సిపాలిటీల వాళ్ళకి ఈ కథ ఒంటబట్టి వుండొచ్చు కాబట్టి వాళ్ళు దోమల నివారణని మొక్కుబడిగా చేస్తుంటారు.

కవులు పూర్వకాలంలో 'హస్తి మసికాంతం' అని దోమని ఏనుగుని పోల్చారు. 'కుంజర యూథంబు దోమకుత్తుక జొచ్చెన్' అన్న పద్య పజిల్‌ని 'తెనాలి రామకృష్ణ' సినిమాలో రామకృష్ణుడు పూరిస్తాడు.

'ప్రేమ లేదు. దోమ లేదు' అంటుంటారు ప్రేమవల్ల కష్టం రాదన్న భయంకల మన పెద్దలు. అఫ్‌కోర్స్ దోమకుట్టని వాళ్ళయినా వుండవచ్చు కాని మనుషుల్లో ప్రేమ కుట్టని వాళ్ళంటూ వుండరు.

ఇలా దోమగారు మన జీవితంలో అనేక భాగాల్లో తన సీట్‌ని శాశ్వతం చేసుకున్నారు.

# ఏన్ ఎలిజీ టు ఎ బైక్

1980 దాకా నాకు బండి అవసరం కలగలేదు. రోజూ ఆఫీసుకి వెళ్ళి రావడానికి నేను ఆడిట్ చేసే కంపెనీవారి వెహికల్ వస్తూండేది. లేదా ఆర్.టి.సి. బస్‌లో వెళుతుండేవాణ్ణి. తీరికవేళల్లో కథలు రాసుకుంటూ. ఆఫీసునించి ఇంటికి, ఇంటినించి ఆఫీసుకి మించి తిరగాల్సిన అవసరం అట్టే వుండేది కాదు. ఉన్నా ఆటోల్లో వెళుతుండేవాణ్ణి.

రచయితల నవలాయుగం ఆరంభం అయాక పెరిగిన వత్తిడులవల్ల, వ్యాపకాలవల్ల అనేక చోట్లకి వెళ్ళడానికి బండి అవసరం,

అధికంగా ఫీలయ్యాను. అయితే నాకు రోడ్ ఫియర్ – అంటే బండిని ట్రాఫిక్‌లో నడపలేనన్న అధైర్యం – వుందని నా అనుమానం. మా అన్నయ్యకున్న జావాని నేర్చుకోమని ఎంత పోరుపెట్టినా నేను ససేమిరా అన్నాను.

1981 లో నాతో ఆఫీసులో పనిచేసే లక్ష్మణాచార్య అనే అతనికున్న మోటర్ సైకిల్ మీద దాన్ని నడవడం నేర్చుకున్నాను. లక్ష్మణాచార్య (ఆయనిప్పుడు ఆంధ్రా బేంక్‌లో పనిచేస్తున్నారు) తమ్ముడు, నేను ఆ మోటార్ సైకిల్‌తో సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్‌కి, ఉస్మానియా యూనివర్సిటీ రోడ్లమీదకి వెళ్ళేవాళ్ళం. అతనే మోటర్‌సైకిల్ రైడింగ్ నేర్పించాడు.

1981 కల్లా నాకు పర్మెనెంట్ డ్రయివింగ్ లైసెన్స్ వచ్చేసింది. నేను నేర్చుకున్న బండి రాజ్‌దూత్. కాబట్టి అదే కొన్నాను. నేను పనిచేసే గవర్నమెంటాఫీసువాళ్ళు మూడున్నర వేలు వెహికల్ అడ్వాన్స్ ఇస్తే మరో ఏడువేలు చేసి రాజ్‌దూత్‌ని సెప్టెంబర్ 1981 లో కొన్నాను. ('పెద్దలకి మాత్రమే' నవలకి పబ్లిషర్స్ ఇచ్చిన పారితోషికం ఐదువేలు ఆ ఏడువేలలో ఉన్నట్లు గుర్తు.) అది కొన్నరోజు నాకు బాగా గుర్తు. ఎందుకంటే అంత ఖరీదయిన వస్తువు కొనడం నా జీవితంతో అదే తొలిసారి. శివాజీ అనే పాత్రికేయ మిత్రుడ్ని మొదటిసారిగా దానిమీద ఎక్కించుకున్నాను. అప్పట్లో అతను జ్యోతి మంత్లిలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేస్తూండేవారు. ఇప్పుడు ఉదయం డెయిలీలో వున్నారు.

బిడ్డొచ్చినవేళ, గొడ్డొచ్చినవేళ అంటారు. అలాగే బండొచ్చినవేళ అని కూడా అనాలి అనిపిస్తుంది. అది కొన్నాకే అనేక రంగాల్లో నేను అభివృద్ధిని సాధించాను. ఎన్నో సందర్భాల్లో అది నాకు బాగా వుపయోగపడింది.

1986 లో నేను కారు కొన్నానన్నమాటే కాని ఇప్పటికీ అవకాశం వున్నంతమేరకు బైక్‌నే వుపయోగిస్తూంటాను. హైద్రాబాద్ ట్రాఫిక్‌కి కారు కంటే బైక్ డ్రయివ్ చేయడమే ఎంతో సుఖం నాకు.

నా రాజ్‌దూత్‌కి ఆత్మ, ప్రాణం లేకపోయినా నేనేంటే ఎంతో

సిన్సియర్‌గా వుండేది. అది ఎప్పుడయినా చెడినా మా ఇంటికి వంద గజాల దూరంలోనే చెడేది, వెళ్ళేప్పుడయినా, వచ్చేప్పుడయినా. చెడటం అంటే క్లచ్‌వైర్ తెగడం లేదా టైరు పంచరవడం. ఇంతకు మించి పెద్దగా అది నన్ను ఎన్నడూ ఇబ్బంది పెట్టలేదు. ఒకే ఒక్కసారి అర్థరాత్రి వస్తూంటే సెక్రటేరియట్ ఎదురుగా దాని గేర్‌రాడ్ వూడి రోడ్డు మీద ఎక్కడో పడిపోయింది. ఎంత వెదికినా అది కనబడలేదు. ఇకదాన్ని నడపడం కుదరదు కాబట్టి ఎదురుగా వున్న సరోవర్ హోటల్‌లోకి తోసుకెళ్ళి లాక్ చేసి ఆటోలో యింటికెళ్ళాను. ఇది 1983 లో అనుకుంటా జరిగింది.

ఉద్యోగరీత్యా నేను వివిధ సెంట్రల్ పబ్లిక్ అండర్ టేకింగ్స్‌కి వెళుతుండేవాణ్ణి. అలాంటి వాటిలో ఐ.డి.పి.ఎల్. లాంటి కొన్ని కంపెనీలు వూరికి దూరంగా వుంటాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగస్థులకి 'ఫైవ్ డేస్ ఎ వీక్' చేసి మిగతా రోజుల్లో పనిగంటలు పెంచినప్పుడు రాజ్‌దూత్ నన్ను బాగా ఆదుకుంది. ఆలస్యంగా నిద్రలేచినా, నేను టైంకి ఆఫీసుకి వెళ్ళడానికి ఆ మోటర్‌సైకిల్ ఎంతో వుపయోగించేది.

ఆ మోటర్‌సైకిల్ మీద నేను మోసుకురాని వస్తువంటూ లేదేమో? 1982 లో ఇల్లు కట్టేప్పుడు బైండింగ్ వైర్, ఎలక్ట్రికల్ సామాను, గునపాలు, పారలు, గమ్మెళాలు, ఒకటేమిటి, లారీలో రానివన్నీ వెనక వాచ్‌మేన్ కూర్చుని పట్టుకుంటే తెచ్చేవాణ్ణి. అలాగే గృహ ప్రవేశనంతరం మా ఇంట్లోని చాలా సామాను ఆ బైక్‌మీదే కొని తెచ్చాను. దానిమీద తెచ్చిన వస్తువుల జాబితా రాస్తే రెండు వందల ఐటంలు పైనే వుంటాయి.

దాదాపు అరవై వేల కిలోమీటర్లు దానిమీద తిరిగినా ఒక్కసారీ ట్రాఫిక్ నేరం మీద చలాన్ కట్టలేదు. కోర్టుకి వెళ్ళలేదు. ఏక్సిడెంట్ జరగలేదు. ఒకే ఒక్కసారి మాత్రం లోయర్ టేంక్‌బండ్ మీద వర్షంలో వస్తూంటే ఎదురుగా వున్న గుంటని తప్పుకోడానికి ఓ ఆటో వచ్చి దాన్ని క్రాస్ చేసిన నా రాజ్‌దూత్ వెనకభాగాన్ని (1983 లో అనుకుంటా) తాకింది. నేను బండిమీంచి పడిన ఏకైక సందర్భం అదే. లక్కీగా

నాకేం కాలేదు. నేర్చుకునేప్పుడు కూడా పడని నేను అలా పడ్డందుకు ఫీలయ్యాను. తర్వాత ఎప్పుడో హెల్త్ చెకప్‌లో తెలిసింది అలా పడడంవల్ల కాలర్ బోన్ కుడివైపు హెయిర్‌లైన్ క్రాక్ వచ్చిందని. (కాని పడ్డాక నాకు అక్కడ నొప్పిలేదు.)

1983–86 ల మధ్య తలచుకుంటే భయం వేసే రెండు సందర్భాల్లో రాజ్‌దూత్‌ని డ్రయివ్ చేశాను. ఇద్దరు మిత్రులు, నేను పార్టీ చేసుకున్నాం. బార్‌లోంచి బయటకి వస్తే వర్షం. కరెంట్ లేదు. అలాగే మిత్రులతో గన్‌ఫౌండ్రి నుంచి వెస్ట్ మారేడ్‌పల్లికి వెళ్ళాను. మర్నాడు ఉదయం లేచిచూస్తే మోటర్‌సైకిల్ క్రేష్‌గార్డు కుడివైపు వంగిపుంది. అది ఎలా జరిగిందో ఈనాటికీ తెలీదు నాకు. నా వెనక కూర్చునున్న ఆ మిత్రుడికీ తెలీదు. (పార్క్ చేసివున్నప్పుడే జరిగింది?)

'ధర్మయుద్ధం' నవల ఓ వారపత్రికలో వస్తున్నప్పుడు కేసెట్ ఇంటర్వ్యూ రికార్డ్ చేశాం. అదయ్యాక నేను, కోపల్లి శివరాం, జీడిగుంట రామచంద్రమూర్తి నాంపల్లిలోని ఓ బార్‌కి వెళ్ళాం. శివరాం వైన్ తప్ప ఏం తీసుకునేవారు కాదు. ఆయనతో వైన్, మూర్తిగారితో విస్కీ తీసుకున్నాను. ఆ తర్వాతి అనుభవం యింకా నాకు పీడ కలే.

వద్దన్నా వినకుండా జీడిగుంటగార్ని నా మోటర్ సైకిల్ మీద ఎక్కించుకుని మొండిగా విజయ్‌నగర్ కాలనిలోని వాళ్ళింట్లో డ్రాప్ చేశాను. ఆ రాత్రి దారిలో కర్ఫ్యూ. ఆయన జేబులోని ఆలిండియా రేడియో ఐడెంటిటీ కార్డు మమ్మల్నిద్దర్నీ అరెస్ట్ కాకుండా కాపాడింది. నన్నాస్థితిలో వంటరిగా పంపడం యిష్టం లేక తనింట్లో పడుకోమని ఆయన ఎంత బలవంతం చేసినా వినకుండా నేను ఇంటికి చేరుకున్నాను. ఇంటి తలుపు తాళం తీయలేకపోయాను చీకట్లో ఎక్కడో పడిపోయింది. అవుట్ హౌస్‌లోని సర్వెంట్‌ని లేపితే అతనొచ్చి, న్యూస్ పేపర్‌ని నిలువుగా మడతలు పెట్టి, అగ్గిపుల్ల గీసి వెలిగించి, ఆ పేపర్ కాగడా వెలుతురులో నేలమీది తాళం చెవి చేతికి తీసిస్తే నేనే తలుపు తెరుచుకుని వెళ్ళి పడుకున్నాను. మర్నాడు మధ్యాహ్నం మూడుకి కాని మెలకువ రాలేదు. తల పగిలిపోయే హేంగోవర్. ఆ పుదయం మా ఆఫీసుకి ఫోన్

చేసి నేను రాలేదని తెలిసి జీడిగుంటగారు భయపడ్డారు దారిలో ఏమైందోనని. సాయంత్రం రేడియో స్టేషన్‌కి ఫోన్ చేసి క్షేమంగా వున్నానని చెప్పాక కానీ ఆయనలో ఆందోళన తగ్గలేదు. ఆ రాత్రి నాకేం అయిందో, ఎందుకంత మొండిగా యింటికి వచ్చానో నాకిప్పటికీ కొరుకుడు పడలేదు. నా జీవితంలో డ్రింక్స్ విషయంలో ఆ రాత్రి మర్చిపోలేని రాత్రే అయింది. అది రాజదూత్ కాబట్టి ఏనుగెక్కినట్లుగా పడకుండా యింటికి రాగలిగాను కాని, అదే స్కూటరయితే ఏమై వుండేదో. చక్రాలు పెద్దవి కాబట్టి స్కూటర్ మీంచి పడినంత తేలిగ్గా మోటర్ సైకిల్ మీంచి పడరు. తమాషా ఏమిటంటే, నాకిప్పటికీ స్కూటర్ డ్రయివింగ్ రాదు, దానికీ దీనికీ పెద్దగా తేడా లేకపోయినా.

రాజ్‌దూత్‌లో వున్న సుఖం పదిరోజులు వూరెళ్ళి వచ్చినా స్టార్ట్ అవుతుంది. అదే కారయితే బేటరీ డౌన్ అయి దాన్ని రీచార్జ్ చేయిస్తేకాని, లేదా తోస్తేకాని కదలదు. తరచు వూళ్ళు వెళ్ళి వస్తుంటాను కాబట్టి ఆ విధంగా కూడా రాజ్‌దూతే నాకెంతో వుపయోగంగా వుండేది.

అరిగిన టైర్లు, చెయిన్ లాంటివి మార్పించడం తప్ప దాని రిపేర్‌కి కూడా పెద్దగా ఖర్చు పెట్టాల్సిన అవసరం రాలేదు. దానిమీద ఎక్కినవాళ్ళ జాబితా కూడా తొమ్మిది వందలపైనే వుంటుంది. పత్రికా సంపాదకులు, తోటి రచయితలు, అభిమానులు, బంధుమిత్రులు, రోడ్డుమీద లిఫ్ట్ అడిగేవాళ్ళు. యిలా ఎంతో మందిని మోసిందది.

ఓ చిన్న రహస్యం. గర్ల్ ఫ్రెండ్‌ని కారెక్కించుకోవడం కంటే మోటర్ సైకిల్ ఎక్కించుకోవడంలోనే సుఖం వుంటుంది. వాళ్ళు ఓకే అనుకుంటే ఆనుకుని కూర్చుంటారు. కారులో అవుతే తప్పనిసరిగా దూరంగా కూర్చోవాలి. వాళ్ళే ఆనుకుని కూర్చుంటే వాళ్ళ నైజం సగం అర్థం అవుతుంది కదామరి. పైగా మోటర్ సైకిల్ వున్న మగాళ్ళు అదిలేని మగాళ్ళకన్నా కొందరాడవాళ్ళకి ఆకర్షణీయంగా కనబడతా రన్నది నిజం. (ఓ సందర్భంలో చందు సోంబాబుతో ఈ ముక్క అంటే వారం తిరక్కుండానే అతనూ ఓ రాజ్‌దూత్ కొన్నాడు!)

నేను కాక దాన్ని నడిపింది అరడజను మంది మించిలేరు. ఈ

సంవత్సరం (91) వర్షాకాలంలో మొదటిసారిగా అది ట్రబుల్ యివ్వడం ఆరంభించింది. మూడు నెలల్లోనే నాలుగైదు ముఖ్యమయిన పార్ట్స్ మార్పించినా వుపయోగం లేకపోయింది. మొదటిసారిగా ఆ బండి పాడవడంతో ఏదో పనిమీద వెళ్ళిన హాస్యప్రియ ఎడిటర్ శంకు (టి. వి. న్యూస్ రీడర్ శోభాశంకర్‌గారి భర్త) యింట్లో దాన్ని లాక్ చేసి ఆటోలో రావాల్సి వచ్చింది. మర్నాడు మెకానిక్ వాళ్ళింటికెళ్ళి తీసుకుని బాగుచేసి తెచ్చిన వారానికి మళ్ళీ ఓసారి దారిలో చెడిపోతే ఆదర్శనగర్ లోని ఓ ఫ్రెండ్ యింటిదాకా తోసుకెళ్ళి అక్కడ లాక్ చేసి వచ్చాను.

ఆ బండి కొన్నప్పటినించి దాని కార్బొరేటర్ క్లీన్‌చేసి సర్వీస్ చేసే మెకానిక్ చెప్పాడు దాన్ని అమ్మేయడం బెటర్ అని. అనేక సందర్భాల్లో నాకు చేదోడువాదోడుగా వున్న దాన్ని అమ్మబుద్ధి కాలేదు. కాని తప్పదు. చివరికి సెప్టెంబర్ రెండో వారంలో, దాన్ని కొన్న సరిగ్గా పది సంవత్సరాలకి ఏ. బి. ఎక్స్ 9570 రాజ్‌దూత్‌ని అమ్మక తప్పలేదు.

మరో రాజ్‌దూత్ కొన్నా అది మానసికంగా 9570 యిచ్చిన తృప్తి యివ్వలేదు నాకు. కొత్తది నా జీవితంలోంచి వెళ్ళిపోయిన ఓ ముఖ్యమయిన భాగానికి సరయిన భర్తీ కాదు కదా.

# అనాటమీ ఆఫ్ ఏన్ ఏజిటేషన్

లోడ్ చేసిన రివాల్వర్ ట్రిగర్‌ని లాగితే బుల్లెట్ ఎలా పేలుతుందో, గ్రెనేడ్‌పిన్‌ని లాగితే ఆ గ్రెనేడ్ ఎలా బద్దలవుతుందో అలాగే ఓ మనిషి కోలాహలాన్ని సృష్టిస్తే అది సమాజంలో మనుషుల్ని, లేదా పదవుల్లోని రాజకీయ నాయకుల్ని తాకి తీరుతుంది.

ఈ కోలాహలంకి అనేక పేర్లున్నాయి. సత్యాగ్రహం, బంద్, ఏజిటేషన్, మౌనవ్రతం, నిరాహారదీక్ష, ఘెరావ్, ధర్నా, రాస్తారోకో,